

బ్రిడ్జెస్ సిటీగా మారనున్న రాజమహేంద్రవరం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

మరి కొద్ది సంవత్సరాల్లోనే నగర రూపు రేఖలు మారనున్నాయని..బ్రిడ్జెస్ సిటీగా రూపు దాల్చనుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రధానంగా గతంలో ఇచ్చిన ప్రతిపాదనల మేరకు విజయవాడ – విశాఖ పట్టణం థర్డ్ లైన్ శాంక్షన్ అయినట్లు తెలిపిందని, మొన్ననే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అధ్యక్షతన నిర్వహించిన రైల్వే బోర్డు సమావేశంలో క్లియర్ చేశారని సమాచారం వచ్చిందన్నారు. అయితే ఆర్చ్ బ్రిడ్జి వద్ద సెకండ్ లైన్ కు ప్రావిజన్ ఉందన్నారు. ఆ మేరకు దీనుకు రావాలనేది వారి ఆలోచనగా ఉందని, అయితే సాధ్యాసాధ్యాలను బట్టి అధికారులు తగు చర్యలు తీసుకోవచ్చునని ఎంపీ భరత్ తెలిపారు.

ఎలక్షన్ అటెన్షన్

- సమాయత్తమవుతున్న అధికార యంత్రాంగం
- శరవేగంగా ఓటర్ల జాబితా సవరణ



ఎలక్షన్ కమిషనర్‌తో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ (ఫైల్)

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఎలెక్షన్ అటెన్షన్ మొదలైంది. జిల్లా అధికార యంత్రాంగం ఈ మేరకు కసరత్తు ప్రారంభించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ జారీ చేసేనాటికి ముందు సంసిద్ధత అవుతున్నారు. ఎన్నికల్లో కీలకమైన ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది. షెడ్యూల్ ప్రకారం ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేసే దిశగా ముమ్మర కృషి జరుగుతోంది. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలనలు చేపడుతున్నారు. ఎస్ ఎస్ ఆర్ ప్రక్రియలో భాగంగా జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బి.ఎల్.ఓ.ల ఇంటింటి పరిశీలన, అక్టోబరు 17 న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అక్టోబరు 17 నుండి నవంబరు 30 వరకు క్లైమ్ లు మరియు అభ్యంతరాల స్వీకరణ అనంతరం క్లైముల అభ్యంతరాల స్వీకరణకు అక్టోబరు 28, 29 మరియు నవంబరు 18, 19 తేదీల్లో బూత్ స్థాయిల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. డిశంబరు 26 కల్లా క్లైమ్ లు మరియు అభ్యంతరాల పరిష్కరించి జనవరి 5 న తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా పూర్తయిన విషయం విదితమే.

ఓటర్ల జాబితా సవరణ

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకారం వచ్చే అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. అర్హత కలిగిన దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించనున్నారు. జిల్లాలో 2023 ఎస్ ఎస్ ఆర్ ప్రకారం 1550944 ఓటర్లు ఉండగా, పురుషులు 760565, మహిళలు 790264, ఇతరులు 115 మంది ఉన్నారు. ఎస్ ఎస్ ఆర్ 2024 కు సంబంధించి ఇప్పటికే మూడు సార్లు జిల్లా స్థాయిలో, డివిజన్, మండల స్థాయి లో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో 1000 మంది పురుషులకు 1039 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఆమేరకు క్షేత్ర స్థాయిలో జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు చేపట్టే హేతుబద్ధీకరణ విధానంలో చేపట్టేందుకు బి ఎల్ వో లకు ఆదేశాలు జారీ చేశారు. ఫారం 6, 6 ఏ, 7, 8 లకు చెంది 21576 దరకస్తులు రాగా 11535 ఆమోదించి, 1211 తిరస్కరించగా, 8148 పరిశీలనలో ఉన్నాయి. ఇప్పటి వరకు కొత్తగా జిల్లాలో 12525 నమోదు కాగా, 12171 తొలగించారు. యువ ఓటర్లు నమోదు కోసం కాలేజీలు, యూని వర్శిటీలో ప్రత్యేక ఎన్రోల్మెంట్ చేపట్టారు. సాంకేతిక సహాయంతో బోగస్ ఓట్ల ఏరివేత సాగుతోంది. ఆధార్ అనుసంధానం సైతం శరవేగంగా చేపడుతున్నారు. ఒకే ఇంటి నెంబర్లో పదుల సంఖ్యలో ఉన్న ఓటర్లను గుర్తించి పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలన జరుపుతున్నారు.

అధికార యంత్రాంగం సమాయత్తం

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నిక లు జరుగనున్నందున అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇప్పటికే రిటర్నింగ్ అధికారుల ప్రక్రియపూర్తయిన విషయం విదితమే. ఎన్నికల విధులలో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు (బీయూ), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ (ట్రయల్ (వీవీప్యాట్), కంట్రోల్ యూనిట్లను (సీయూ) ఎన్నికల సంఘం పంపించింది. బీయూ, ఈ వీవీప్యాట్, సియులను క్రోడీకరించి ఓటింగ్ నిర్వహించే విధానాన్ని ఈవీఎం పద్ధతి. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ఈవీఎంను సమకూరుస్తారు. బెంగుళూరు బెల్ కంపెనీ నుంచి సరఫరా చేసిన 4930 వివి ప్యాట్స్ జిల్లాకు చేరుకున్నాయి. వాటిని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేసి స్ట్రాంగ్ రూం గోడౌన్ డిపాజిట్ చేశారు.వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇప్పటికే ఫస్ట్‌లెవల్ కమిటీ (ఎఫ్‌ఎల్‌సి) పరిశీలన ప్రక్రియను సైతం అధికార యంత్రాంగాలు పూర్తి చేశాయి. అత్యంత కీలకమైన వీవీ ప్యాట్‌లను లాలా చెరువులోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు సీ, సీ కెమెరా, 24 గంటల పర్యవేక్షణతోకట్టుదిట్టమైన భద్రతా చర్యలుచేపట్టారు.



నల్లాకులవారిపాలెంలో చెత్త సంపద కేంద్రం

శిథిలావస్థకు చేరుతున్న చెత్త సంపద కేంద్రాలు

ప్రజాశక్తి–పెరవలి

మండలం 18 గ్రామ పంచాయతీల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చెత్త సంపద కేంద్రాల కోసం పక్కా షెడ్లు నిర్మించారు గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించి దాని ద్వారా సేంద్రియ ఎరువులు తయారుచేసి తక్కువ ధరకు రైతులకు అమ్మటానికి ఈ సంపద కేంద్రాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని నిర్మాణాలు చేపట్టారు మండల పరిధిలో అజ్జరం, నడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సంపద కేంద్రాలు ఉపయోగంలో ఉన్నాయి. మిగిలిన చెత్త సంపద కేంద్రలు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక పక్క షెడ్లు బీటల వారి షడ్లపై ఉన్నటువంటి రేకులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి. అయితే అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు అంటున్నారు. ఒక పక్క నిరుపయోగంగా ఉంచుతూ మరొకపక్క ప్రజాధనం వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన షెడ్లు గాలికి వదిలేయడంతో గోడలు బీటల వారి షెడ్లు తుప్పు పట్టి పోవుతున్నాయి. మల్లేశ్వరం, కాకరపర్రు, ముక్కామల, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, కానూరు, పెరవలి తదితర గ్రామాల్లో షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

అన్ని గ్రామాల్లో తడి పొడి చెత్త బహిరంగ ప్రదేశాలు రోడ్ల పక్కన నరసాపురం– నిడదవోలు మెయిన్ కాలువ పక్కన తీపర్రు,కాపవరం గ్రామాల్లో యథేచ్ఛగా వేస్తున్నా పట్టించుకునే నాధుడు లేడు. జాతీయ రహదారి అన్నవార్పడు గ్రామపంచాయతీ పరిధిలో రహదారి పక్కన పలుచోట్ల మళ్లీ చెత్త వేస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి పక్కన చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన తూతూ మంత్రంగా చెత్త తొలగించిన మళ్లీ యథేచ్ఛగా చెత్త వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. గ్రామాల్లో తడి పొడి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని కాలవగట్లు రోడ్ల పక్కన చెత్త వెయ్యకుండా కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు వర్షాకాలం సీజన్లో రోడ్ల పక్కన చెత్త వేయడం వల్ల దుర్గంధం వస్తోంది

దళితుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్....కెవిపిఎస్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పై 'దళిత రక్షణ యాత్ర చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పై'రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు అధ్యక్షత వహించారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్, కిరణ్. జైభీమ్ సేనరాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. భాను చందర్, ఎపి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ అధికార ప్రతినిధి కెకె.సంజీవరావు ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, బి.చినబాబు, టీడీపీ ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్.సుందరబాబు, బి.రాజులోవ తదితరులు మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానాలను కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పత్రికలకు విడుదల చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మెడికల్ సీట్లు కొత్త విధానం, పేదలను దళిత గిరిజనులను దోచి పెత్తందారులకు దోచిపెట్టే విధానం రద్దు చేయాలని, 107 జిఒ రద్దు చేయాలని డిమాండ్ చేసింది ఎస్సి, ఎస్టి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, రద్దు చేసిన హాస్టల్స్ తెరవాలని, ఎస్సి,ఎస్టి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించరాదన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేడు ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విభాగం, తూర్పు గోదావరి జిల్లా విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా నూతన అధ్యక్షులు కొత్త బాల మురళీకృష్ణ చెప్పారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 43దేశాల్లో ఈ సంస్థ విస్తరించి ఉందన్నారు. మాజీ మంత్రి టిజి వెంకటేష్ గ్లోబల్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారని, గ్లోబల్ అధ్యక్షుడుగా టంగుటూరి రామకృష్ణ ఉన్నారని తెలిపారు. రాష్ట్ర నూతన అధ్యక్షులు కోనా శ్రీనివాసరావు, అలాగే తన సారధ్యంలో జిల్లా కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేస్తాయని తెలిపారు. గోదావరి గట్టున వాసవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం టిజి వెంకటేష్ ని ఊరేగింపుగా కొవ్వూరు పిఆర్ ఆర్ ఆర్ కల్యాణ మండపానికి తీసుకెళ్తామని, అక్కడ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని వివరించారు. ఆర్యవైశ్య ప్రముఖులకు, నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన వారికి సత్కారాలు చేస్తామని తెలిపారు.

జిఒ 107,108లను రద్దుచేయాలని డిమాండ్

ప్రజాశక్తి–కొవ్వూరు రూరల్


రాష్ట్ర నూతనంగా ఏర్పాటు చేసిన5 ప్ర భుత్వ వైద్య కళాశాల్లో 50శాతం సీట్లకు మాత్రమే రిజర్వేషన్ కేటాయించడాం బాధాకరమని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు మొత్తం750 సీట్లకుగాను15శాతం(113) ఆలిండియా కోటలో కింద తీస్తే ఉన్న 637సీట్లలో 50 శాతం రిజర్వేషన్లు వర్తించే విధముగా జిఒ107, 108 ద్వారా భర్తీ చేస్తే ఎస్సిలు 48సీట్లు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు ఈప్రక్రియవల్ల ఎస్సి, ఎస్టి, బిసి, ఇబిసి వర్గాలు నష్టపోవలసి వస్తుంది అని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిఒ 107,108 లను తక్షణం రద్దు చేయాలని బొంత శ్యామ్ కోరారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలి

ప్రజాశక్తి–చాగల్లు

సమస్యల పరిష్కారానికి సభ్యులు సంఘటితంగా కృషి చేయాలని సంఘం బలోపేతానికి సహకరించాలని రిటైర్డ్ ఎంఇఒ కెఎస్ఎన్.మూర్తి అన్నారు. శనివారం చాగల్లు మండల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. చాగల్లులోని అంబేద్కర్ రీడింగ్ భవనంలో ఉదయం సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షులు డేగల నాగేశ్వరరావు, గంజి డేనియల్ వెత్సా గంగాధరరావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు .

కార్టూ'నిజం'



కల్తీ ఆహారంతో ఆరోగ్యం పాడై..
నకిలీ డాక్టర్ వద్దకు వెళ్లారు పిన్నీ..!!

'నన్నయ'లో జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి- రాజానగరం


కార్యక్రమంలో పాల్గొన్న విసి ఆచార్య పద్మరాజు, ప్రముఖులు,విద్యార్థులు

రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం మరియు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 131వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఎస్ఆర్.రంగనాథన్ గ్రంథాలయ విద్యలో నూతన ఒరవడులు తీసుకువచ్చి పాఠకులకు మరింత దగ్గరగా పుస్తకాలు మరియు సమాచార విజ్ఞనము అందుబాటులో ఉండటానికి అవసరమైన సిద్ధంతాలు రుపకల్పనచేశారని అన్నారు. ఆయన కృషిని గుర్తించిన భారతప్రభుత్వము పద్మశ్రీతో సత్కరించిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సమన్వయకర్త డా.పి.విజయనిర్మల మాట్లాడు తూ విద్యార్థులు గ్రంథాలయ సేవలను ఉపయోగించు కోవలన్నారు. లైబ్రరీ అసిస్టెంట్ డా.టి.సింహాచలం మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయవిద్యలో ఎస్ఆర్.రంగనాథన్ కృషి కొనియాడదగినదన్నారు. ఫ్యాకల్టీ అసోసియేట్ డా.సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రనిర్వహణలో కొత్తమేలుకువలు నేర్పి, గ్రంథాలయవిద్యలో విప్లవాత్మక మైన మార్పులు తీసుకువచ్చి సమాచార విజ్ఞానము అందుబాటులో ఉంచటానికి ఎస్ఆర్.రంగనాథన్ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ డా.పి.వేంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ డా.జ్యోతి ర్మయి, డీన్ ఎక్సామినేషన్ డా. మట్టారెడ్డి, ఆచార్య.వై. శ్రీనివాసరావు, డా కె.దీప్తి మరి యు గ్రంథాలయ సిబ్బంది విజయ కుమార్, సతీష్, దుర్గా ప్రసాద్, సూర్యకుమారి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం :** శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన ఘనంగా నిర్వహిచారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ డాక్టర్ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజును (ఆగస్టు12న)జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఆయన ప్రతిపాదించిన ఐదు చట్టాల సిద్ధాంతం లైబ్రరీ వ్యవస్థను నిర్వహించే సూత్రాలను వివరిస్తుందని, ఈ చట్టాన్ని 1931లో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ యొక్క ఫైవ్ లాస్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ పేరుతో మొదట ప్రచురించబడ్డాయన్నారు. అవి 1.పుస్తకాల ఉపయోగం కోసం, 2.ప్రతి పాఠకుడి పుస్తకం 3.ప్రతి పుస్తకం దానిరీడర్ 4.పాఠకుని సమయాన్ని ఆదా చేయడం 5.లైబ్రరీ ఎదుగుతున్న జీవి అని తెలియజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.ఎ.ప్రియరంజని, లైబ్రేరియన్ కోఆర్డినేటర్ మరియు ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, లైబ్రేరియన్ సభ్యులు కేవిఎస్ అన్నపూర్ణాదేవి, ఎన్.స్వాతి పాల్గొన్నారు.

'ఎస్‌కెఆర్'లో నా మట్టి-నా దేశం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మేరీ మాటి మేర దేశ్ (నా మట్టి–నా దేశం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి జవాన్లు దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారికి గౌరవ వందనం చేశారు. తదనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లా డుతూ స్వాతంత్ర్య దినోత్సవం వరకు దేశవ్యాప్తంగా మేరీ మాటి మేరా దేశ్ (నా మట్టి– నా దేశం)పేరుతో అమరవీరులు జ్ఞాపకార్థం దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7,500 కళాశాలల నుంచి పవిత్ర మట్టిని వారితో పాటు మొక్కలను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళ్తారని అన్నారు. ఆ పవిత్ర మట్టితో, మొక్కలతో ఢిల్లీలోని జాతీయ యుద్ధస్మారకం సమీపంలో అమృత్ వాటికను నిర్మించనున్నారని, అమృత్ వాటిక 'ఏక్ భారత్ –శ్రేష్ట్ భారత్' గొప్ప చిహ్నంగా నిలుస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కెఎస్.రత్నకుమార్, ఎన్ఎస్ఎస్ అధికారిణిలు కె.వీరలక్ష్మి, ఎమ్.కాస్మ, పి.శ్రీదేవి మరియు సభ్యులు వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎస్‌కెఆర్‌లో మొక్కలు నాటుతున్నదృశ్యం

అమరవీరులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి –రాజానగరం

దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమర వీరులను, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని విద్యార్థులకు ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సూచించారు. రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో నా భూమి నా దేశం శిలాఫలకాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. కార్యమంలో వైసి మండల కన్వీనర్ దూలం పెద్ద, కోరుకొండ జెడ్‌పిటిసి సభ్యుడు కె.నాగేశ్వరావు, మందారపు వీర్రాజు, సర్పంచుల సమైక్య సంఘం అధ్యక్షులు కోలపాటి వెంకన్న, అడబాల దుర్గారావు, నాయ కులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణపట్నం జెడ్‌పి స్కూల్లో ఎంఎల్ఎ రాజా ప్రతిజ్ఞ

నిధులు దుర్వినియోగపరిస్తే చర్యలు

జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు ఆరిఫ్

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మసీదు నిర్వాహకులు దుర్వినియోగ పరిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు మొహమ్మద్ ఆరిఫ్ హెచ్చరించారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆదాయం లేని మసీదుల నిర్వహణ నిమిత్తం ఇమామ్, మౌజన్ల జీతాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.15 వేల గౌరవ వేతనాన్ని అందు కుంటూ ఇమామ్ మౌజన్లను నియమి ంచకుండా మసీదులను నిర్వహిస్తున్న కమిటీలపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకుం టామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గౌరవ వేతనాలు అందుకుం టున్నటువంటి మసీదులు వక్ఫ్ బోర్డ్ అధికా రులతో కలిసి జిల్లా కమిటీ వారు తనిఖీలు చేయగా పలుచోట్ల అవకతవకలు బయట పడ్డాయని, వారికిచ్చిన నిర్ణీత సమ యంలోగా సదరు కమిటీలు ఖర్చుల వివరాలను అధికారులకు సమర్పించాలని లేనిపక్షంలో సదరు మసీదులను వక్ఫ్ బోర్డ్ జిల్లా యంత్రాంగం స్వాధీన పరుచుకుని వారి కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలను నియమిస్తామని అన్నారు.

95 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి–నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో రావిమేట్ల గ్రామంలో సుమారు 95 మందికి షుగర్ పరీక్షలు మరియు బిపి పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్ ఉన్నవారికి డాక్టర్ సలహాలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ గుంపుల వెంకటేశ్వరరావు, అడ్వైజర్ ఇంజె శేఖర్, ఆర్ఎంపి మునీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశా గ్రామోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి–రాజానగరం

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఈశా గ్రామోత్సవం, గ్రామీణ భారత క్రీడా స్ఫూర్తి, సంస్కృతి ఉత్సవం ఘనంగా ప్రారమయ్యాయి. రెండు రోజుల గ్రామోత్సవం కార్యక్రమానికి ఎంపీ మార్గాని భరత్, వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. విశ్వవిద్యాలయంలో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. విసి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ నన్నయ్య విశ్వవిద్యా లయంలో ఈశా గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చడం ఆనందంగా ఉందని అన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి క్రీడాకారులు విశ్వవిద్యాలయనికి వచ్చి పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. నేటి ఒత్తిడి ప్రపంచంలో యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, సమస్యలను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు పాల్గొన్నారు.


వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి–గోపాలపురం

టిడిపి కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం భీమోలు లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ సీనియర్ నాయకులు షేక్ నబీన సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వెంకట్రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పార్టీకి వీర అభిమాని అయిన నబీన సాహెబ్ ఎంతో తను కష్టపడి పనిచేసేవారని అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. నవీన సాహెబ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగి ఉండాలని తమ ప్రగఢ సానుభూతి తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పారావు, అన్నెపు సూర్యనారాయణ, గంధ్రుతు శీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి–గోకవరం

గోకవరం గ్రామపంచాయతీ నందు మండల యానిమేటర్ల సమస్యలపై సెర్ప్ సిఇఒకు శనివారం వినతిపత్రం అందజేశారు. పలువురు యానిమేటర్లు మాట్లాడుతూ వైఎస్ఆర్ క్రాంతి పథకంలో పని చేస్తున్న యానిమేటర్లు అందరూ 22 సంవత్సరాల నుంచి స్వయం సహాయక సంఘాలకు సేవలందిస్తున్నామన్నారు. మా సేవలను గుర్తించి సిఎం జగన్ రూ.8వేల వేతనం ప్రకటించారన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయుటలో కృషి చేస్తున్నామన్నారు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రజలుకు చేరవేస్తున్నామన్నారు. కానీ తమకు ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం లేదన్నారు. ప్రస్తుతం మా జీతాలు మండల సమైక్య ద్వారా జమ చేస్తున్నారన్నారు. ఈ విధంగా కాకుండా నేరుగా మా ఖాతాల నందు జమ చేయాలని సిఇఒకి వినతిపత్రం అందజేశామన్నారు. అలాగే తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, అర్హత గల వారికి పదోన్నతి, కనీస వేతనం రూ.25వేలు మంజూరు చేయాలని, పెంచిన వేతనాలను పర్సనల్ అకౌంట్‌కి జమ చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జండర్ విధానాన్ని రద్దు చేయాలని, సెర్ప్ నుంచి 5జి నెట్‌వర్క్ మొబైల్స్ ఇప్పించాలని, బకాయి పడిన వేతనాలు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు పాల్గొన్నారు.


సెర్ప్ సిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యానిమేటర్లు

సచివాలయ కన్వీనర్లకు అభినందన

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ మండలం సచివాలయం కన్వీనర్లతో కాతేరు గ్రామం లోను మరియు రాజమహేంద్రవరం రూరల్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా రూరల్ కో ఆర్డినేటర్ మరియు రాష్ట్ర పచ్చదనం మరియు సుందరికరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా ఇతర కారణాల వల్ల సంక్షేమ పథకాలు ఆగిపోకూడదన్నారు. అర్హులందరికీ అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా పేద వాళ్ళకి అందజేయాలని నిర్వహించిన కార్యక్రమం జగనన్న సురక్ష అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భారతదేశ చరిత్రలోనే సేవల విషయంలో చరిత్ర సృష్టించిందని తెలిపారు. రూరల్ నియోజకవర్గం అత్యధిక సేవలు అందించి రాష్ట్రం లోనే మూడవ స్థానంలో నిలిచిందని తెలిపారు. అత్యధిక సేవలు అందిచడంలో కృషి చేసిన సచివాలయం కన్వీనర్లను అభినందించారు.


నివాళులు అర్పిస్తున్న ఎంఎల్ఎ

మాజీ ఎంపిటిసి సభ్యుడు రమణమూర్తి మృతికి నివాళి

ప్రజాశక్తి –పెరవలి

మండలం కాకరపర్రు గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యుడు కాపాకా రమణమూర్తి శుక్రవారం రాత్రి హఠాత్తుగా మతి చెందారు.. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు శనివారం రమణమూర్తి భౌతికకాయాని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.. రమణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గుబ్బల ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు రాంపండు గుబ్బల శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం కామనగరువు పెట్రోల్ బంక్ సమీపంలోని పంట కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. మండలంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన జంగా రామ్ కుమార్ (27) ఈ నెల 11న అమలాపురం ధూర్త కంపెనీకి పనికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. తిరిగి రాత్రి రామ్‌కుమార్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అమలాపురం చుట్టుపక్కల వెతుకుతుండగా శనివారం మధ్యాహ్నం కామనగరువు పెట్రోల్ బంక్ ఎదురుగా పంట కాలువలో శవం ఉన్నట్లు తెలిసి వెళ్లి చూడగా రామ్ కుమారదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు తాను అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తగు చర్య నిమిత్తం తాలూకా పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదుపుతప్పి కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి వ్యాన్ బోల్తా పడిన సంఘటన శనివారం రోడ్డు లంకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు నుంచి ఒక పార్సిల్ సర్వీస్ ఐసర్ వ్యాన్ కంటైనర్ రాజమండ్రి పార్సిల్ అన్లోడ్ చేసి తిరిగి హైదరాబాద్ వెళుతుండగా గోపాలపురం, దేవరపల్లి మండలం గొల్లగూడెం మధ్య వచ్చేసరికి రోడ్డు మలుపు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ పోలు విరిగిపోయింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో తాళ్ళరేవు పంచాయతీ గుత్తులవారి పాలెంలో విషాదం అలముకుంది. మండలంలోని తాళ్లరేవు గ్రామం ముత్యాలమ్మ గుడి సమీపంలో రెడ్డి వెంకట్రావు స్మారక భవనం వద్ద సచివాలయం-2 ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వాసంశెట్టి ప్రసాద్ (46) మరణించడంతో గుత్తులవారిపాలెం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రసాద్ సోదరుడు పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో అసువులు బాసాడని వాసంశెట్టి ప్రసాద్ తల్లిదండ్రులు నాగవేణి, వెంకటేశ్వర్లు బోరున గుండెలవిసేల రోదిస్తున్నారు.

ముగ్గురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురు మండలం నగరం ఎస్ఐ జానీ బాషా పామర్రు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అవగా, రాయవరం ఎస్ఐ సురేష్‌ను నగరం స్టేషన్‌కు బదిలీ చేశారు. అమలాపురం విఆర్‌లో ఉన్న జి.నరేష్‌ను రాయవరం పిఎస్‌కు బదిలీ చేశారు.


పరామర్శిస్తున్న జ్యోతుల నెహ్రూ

పలువురిని పరామర్శించిన నెహ్రూ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి, మల్లేపల్లి, జెడ్.రాగంపేట గ్రామాలకు చెందిన పలువురిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. గండేపల్లి గ్రామానికి చెందిన నందం రాంబాబు ఇటీవల కాలుకి ఇన్ఫెక్షన్ కావడంతో వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన నక్క సూర్యనారాయణ, గద్దె రామచంద్ర రావు, పల్లి రాముడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను మల్లేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతుల చక్రం, అదే గ్రామానికి చెందిన నట్టే పకీర్ ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాన్ని, జెడ్ రాగం పేటకు చెందిన దేవరపల్లి అన్నవరం, అదే కుటుంబానికి చెందిన దేవరపల్లి ముత్యాలమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతులమోహనరావు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, వెలమాటి కాశి, కందుల కొండయ్య చౌదరి, ఇప్పర్ల బాబి, చాగంటి సత్యనారాయణ మూర్తి, వెంపాటి రాజు, ఇప్పర్ల సురేష్, పైలా వెంకన్న, ఉప్పలపాటి సత్తిబాబు, ఉండవల్లి వరప్రసాద్, కురుకూరి శ్రీనివాస్, వెంపాటి సతీష్, కన్నబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గడపగడపకూ..

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లల మామిడాడలో శనివారం మూడోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల ఒరవడిని కొనసాగిస్తు న్నారన్నారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపిపి ద్వారంపూడి పద్మ వెంకట్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి (హంస), ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, లయన్స్ క్లబ్ శ్రీ సూర్య అధ్యక్షులు కడిమి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతల పరామర్శలు.. ప్రజల నిరసనలు..

గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పర్యటించిన ముఖ్యనేతల పర్యటనలు ఆద్యంతం ఆత్మస్తుతి... పరనిందలకే పరిమితం అయ్యాయి. గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్షనేత నారా చంద్రబాబు రెండు రోజుల పాటు వేర్వేరుగా జిల్లాలో పర్యటించిన విషయం విదితమే. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయంచని కేంద్ర ప్రభుత్వంపై ఒక్క విమర్శ కూడా చేయకపోవటం ప్రజలను విస్మయానికి గురి చేసింది. మణిపూర్‌లో జరిగిన ఘోరాలకు నిరసనగా పార్లమెంటులో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి సైతం ఎన్‌డిఎకు మద్దతు తెలపటం విశ్వసనీయతకు దర్పణం పట్టింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి కోనసీమలో రక్షణ గోడలు నిర్మిస్తామని ఇచ్చినహామీపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగేళ్లుగా ఏమిచేశారనే ప్రశ్న తలెత్తుతోంది. గతేడాది చేపట్టిన పర్యటనలో ఏటిగట్లు పటిష్టం చేస్తామని ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయి. దీంతో తాజా హామీనైనా నిలబెట్టుకోకుంటే రాబోయే ఎన్నికల్లో పరాభావం తప్పదని వరద బాధితులు మండిపడుతున్నారు. మరో వైపు చంద్రబాబు నిర్వహించిన దేవరపల్లి, కోరుకొండ సభలలో ప్రజలపై వరాల జల్లు కురిపించారు. ప్రధానంగా రాజానగరం ఎంఎల్‌ఎపై చేసిన విమర్శలు జిల్లాలో చర్చనీయాంశం అయ్యాయి. సాగునీటి ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ప్రశ్నించకపోవటం పారదర్శకతను ప్రశ్నిస్తోంది. ఇరువురి పర్యటనలు ఎన్నికలే లక్ష్యంగా చేస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఒక వైపు విద్యుత్ బిల్లులు... మరో వైపు కోతలు

విద్యుత్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నడ్డి విరుస్తోందంటూ వినియోగదారులు వాపోతున్నారు. వినియోగపు ఛార్జీలకు రెట్టింపుగా బిల్లులు జారీ చేయటం విమర్శలకు దారి తీస్తోంది. విద్యుత్ సంస్థలకు సర్ ఛార్జీలు వసూళ్లు చేసేందుకు అవకాశం కల్పించిన విషయం విదితమే. దీంతో వివిధ రకాల పేర్లతో వసూళ్లకు సంస్థ తెరలేపింది. గతంలో నెలకు 450 వచ్చే వారికి సైతం గత రెండు నెలలకు రూ.700పైగా బిల్లులు జారీ చేసినట్లు తెలుస్తోంది. వినియోగపు యూనిట్లు యథాతథంగా ఉన్నప్పటికీ అదనపు ఛార్జీలు విధించటంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయని వాపోతున్నారు. మరో వైపు విద్యుత్ కోతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటంతో రొటేషన్ పద్ధతిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జవాబివ్వటం విస్తుగొలుపుతోంది. రోజుకు గంట నుంచి 2 గంటలకు పైగా విద్యుత్ కోతలు విధించటం ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వం చొరవ చూపి ఛార్జీల భారం తగ్గించాలని అదే విధంగా నాణ్యతతో కూడిన సరఫరా చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

కేంద్ర కార్మిక సంఘాల ఆందోళన బాట

క్విట్ ఇండియా స్ఫూర్తితో మోడీ ప్రభుత్వంపై కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటాయి. కాకినాడలో కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నేతలను అక్రమ అరెస్టులు చేయటం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పౌరహక్కులను హరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ఐక్యంగా చేపట్టిన ఆందోళనలకు వందలాది మంది తరలి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నిరసనలు హోరెత్తాయి. గడచిన 9 సంవత్సరాలలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం వినాశకర ఆర్థిక విధానాలనే అవలంభించిందని కార్మిక సంఘాల ప్రతనిధులు మండిపడ్డారు .రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దిగొచ్చిన టమోటా

టమోటా ధరలు తగ్గడంతో సామాన్య ప్రజలకు కొంత ఊరట లభించింది. బహిరంగ మార్కెట్లో కేజీ టమోటా రూ.60 కాగా రైతు బజార్లలో రూ.40 చొప్పున అందుబాటులోకి వచ్చాయి. గత నెల రోజులుగా కేజీ రూ.200 నుంచి రూ.220 వరకూ విక్రయాలు జరిగిన విషయం విదితమే. చికెన్ ధరలతో సైతం టమోటాలు పోటీ పడటం ఇదే తొలసారని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు దిగిరావటంతో కొనుగోలు దారులతో పాటు వ్యాపారులకు ఊరట లభించింది.

యానాం వార్తలు

బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు తగిన గుర్తింపునిచ్చేందుకు ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మహిళా శిశుఅభివద్ధి మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును అందజేస్తుందని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.18 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులు https://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఢిల్లీలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం ఉంటుందన్నారు.

యానాంకు మంత్రి లక్ష్మీనారాయణ రాక

ప్రజాశక్తి - యానాం

ఆగస్టు 15న స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురువేసేందుకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ రానున్నట్లు శనివారం ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు.

పోలీస్ కవాతుకు రిహార్సల్స్


ప్రజాశక్తి - యానాం


రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే పోలీస్ కవాతు కోసం రిహార్సల్స్ చేస్తున్నారు. ఎస్‌పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి పోలీస్ కవాతు సాధనను పరిశీలించి పోలీసులకు సూచనలు ఇస్తున్నారు.

లయన్స్ విజన్ ఆధ్వర్యంలో సీమంతాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్


సీమంతాలు చేస్తున్న సభ్యులు

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం పండుగ వాతావరణంలో సీమంతాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ గర్భవతులకు సీమంతాలు జరిపే ఆచారం అనాదిగా ఉందన్నారు. అమ్మకు, అమ్మతనానికి ఇచ్చే గౌరవం మన దేశ సంస్కృతిలో మరింత ఎక్కువ కాబట్టి సామూహికంగా సీమంతలు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనివలన గర్భిణులకు మానసిక భరోసా కలుగుతుందన్నారు. శారీరిక, మానసిక ఆరోగ్య భద్రతతో కూడిన భరోసాను కల్పించేందుకు సీమంతాలు దోహదపడతాయన్నారు. తల్లి మానసిక ఆనందం పుట్టబోయే బిడ్డ మానసిక ఆరోగ్య మీద ప్రభావం చూపుతుంది కాబట్టి ఎప్పుడు ప్రశాంతంగా ఉండాలని ప్రసున తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ శ్రీరామ్ గణేష్ ప్రసాద్, ఎన్.శ్రీదేవి రెడ్డి, బి.వాణి, రమా సుందరి, శ్రీవాణి, డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పని చేస్తున్న 4,569 మంది ఉద్యోగులకు 23 శాతం జీతం పెంచుతూ ప్రభుత్వం జిఒ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సిఎం వైఎస్.జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఉద్యోగులు మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి సెర్ప్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.ధనుంజయరెడ్డి మాట్లాడారు. సెర్ప్ ఉద్యోగుల కష్టాన్ని గుర్తించి జీతం పెంపుదల చేయడంపై సిఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.శ్రీరమణి, ఎల్ 4 సంఘం అధ్యక్షులు తోట అశోక్ భరత్, ఎల్ 3 సంఘం అధ్యక్షులు పుప్పాల సూర్యనారాయణ, డిపిఎం బాబూరావు, ఎపిఎం బి.ప్రశాంతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు అనంత లక్ష్మి

రాష్ట్రంలోని నిరుపేదలను సంపన్నులను చేయడమే టిడిపి అధినేత చంద్రబాబు ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలపరిధిలోని ఇంద్రపాలెంలో శనివారం నిర్వహించిన 'మహాశక్తి-భవిష్యత్తు గ్యారెంటీ'లో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి- మీ అనంతలక్ష్మీ' 26వ రోజు కార్యక్రమం నిర్వహించారు. తెలుగు మహిళలు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకంపై వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ జలగలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చేది పైసా, జేబులో వేసుకునేది వంద రూపాయలు అనేలా సంక్షేమ పథకాల అమలు తీరు ఉందన్నారు. గ్రామస్వరాజ్యాన్ని తీసుకు వచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబు అయితే ఆ గ్రామస్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసింది జగన్ అని ధ్వజమెత్తారు. పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులకు రూపాయి ఖర్చుపెట్టింది లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు భరోసా అని అన్నారు. పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబు మినీ మ్యానిఫెస్టోను ప్రకటించారన్నారు. సంపద ఎలా సృష్టించాలో తెలిసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహనరెడ్డి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. మన రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు వంటి నాయకులను ఆదరించాలన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబును ఆదరించి గెలిపించాలని అనంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిదే నాగ హరినాథ్, నాయకులు పండూరి జయకృష్ణ, మరుకుర్తి నాగబాబు, పంపన బుజ్జి, పుల్లయ్య శ్రీను, టేకుమూడి శ్రీను, కాకరపల్లి మోహన్ రావు, బొజ్జ భవాని సాంబశివరావు, కొమిరిశెట్టి నర్సింగరావు, దొమ్మేటి వెంకటరమణ, కింతాడ శేఖర్, గుబ్బల సత్తిబాబు, గొల్లపల్లి లక్ష్మి, పిల్లి శ్రీధర్, చల్మాజీ, పెంకె వీరబాబు, కొల్లుబోయిన అచ్యుత్, టేకుమూడి శ్రీనివాస్, చాత్రాతి సాయిబాబా, పలివెల గాయత్రి, పిల్లి విజయ్ గోపాల్, కందర్ప సురేష్ తదితరులు పాల్గొన్నారు.


టిడిపితో అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రాజపూడిలో శనివారం మహాశక్తి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం నెహ్రు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టం చెయ్యడంతో ఆంధ్రప్రదేశ్ మహిళల గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిరన్నారు. మహిళలకు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి ఆర్థిక పరిపుష్టి సాధించిన నాయకుడు చంద్రబాబు అన్నారు. చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇచ్చి వారిని సగర్వంగా తిరిగేలా చేసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. 2014 నుండి 2019 వరకు మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకు వచ్చి అభివద్ధి పరిచారన్నారు. చంద్రబాబు ఆడబిడ్డకు పెళ్లి కానుకను ఇస్తే వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మహిళలను ఆర్థికంగా కుంగదీసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోలినాటిధర్మానందకుమారి, నకిరెడ్డి సూర్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ

మండలంలోని బలభద్రపురంలో ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రజలకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్‌పి ఎస్‌పి సతీష్ ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రాత్రి సమయంలో ఆరుబయట లేదా మేడపైన నిద్రించేవారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వివాహాది శుభకార్యాలకు, వ్యక్తిగత పనులు నిమిత్తం ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లేవారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. రాజపూడి గ్రామ పరిధిలో పీస్ కమిటీని నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మరోతి శివగణేష్, సిదిరి సత్తిబాబు, యర్ర రామకృష్ణ, పప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు